నిఘా నేత్రాలతో అధికారుల పనితీరు మెరుగు


దృశ్యాలు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, న్యూస్‌టుడే: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సీసీ కెమెరాల ద్వారా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు శాఖల పనితీరు మెరుగుపడటానికి ఇవి ఉపయోగపడతాయని అన్నారు. అన్ని మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారి శ్రీరాం, ఈడీఎం సందీప్ ఉన్నారు.

పెరిగిన వరద... ఆలయం మూసివేత


ఆలయం ముందు వరద


రాజగోపురంలో అమ్మవారికి పూజలు

పాపన్నపేట, న్యూస్‌టుడే: సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద వరద ప్రవాహం మంగళవారం పెరిగింది. దీంతో తెల్లవారు జామున అర్చకులు సైతం ఆలయం వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉండడంతో రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

సన్నాల కొనుగోళ్లకు ప్రత్యేక కేంద్రాలు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో సన్న ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డితో కలిసి వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. సన్న ధాన్యం అధికంగా సాగు చేసినందున వెల్దుర్తి మండలంలోనూ కొనుగోళ్ల కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. రెండు రోజుల్లో ధాన్యం తూకం చేపడతామన్నారు. తూకం చేసిన 48 గంటల్లో రైతులకు డబ్బులు చెల్లిస్తామన్నారు. వెల్దుర్తిలోని ఇండెన్ వంట గ్యాస్ ఏజెన్సీ ఖాళీ సిలిండర్లలోకి గ్యాస్ నింపారనే దానిపై నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకుముందు వెల్దుర్తిలో పానాది(బండ్లబాట)గా ఉన్న స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు నిర్మించారనే ఆరోపణలు రావడంతో వాటిని పరిశీలించారు. వెల్దుర్తి తహసీల్దార్ కృష్ణ, గిర్దవార్ జయభరత్‌రెడ్డి పాల్గొన్నారు.

అకాల వర్షం.. అతలాకుతలం

● పొలాల్లోనే నేలవాలుతున్న వరి ● కేంద్రాల్లో తడిసిన ధాన్యం...

న్యూస్‌టుడే, మెదక్: ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన అన్నదాతలకు అకాల వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కోతకు వచ్చిన సమయంలో కురుస్తున్న వానలతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరోవైపు కోత కోసిన ధాన్యాన్ని కేంద్రాల్లో ఆరబెడితే తడిసిముద్దవ్వడమే కాకుండా కొట్టుకుపోతున్నాయి. వర్షాలు ఇలాగే కురిస్తే రైతాంగానికి భారీ నష్టం ఏర్పడే అవకాశం ఉంది. జిల్లాలో ఈ సీజన్‌లో 2.97 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. వీటి ద్వారా 7.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇందులో వ్యక్తిగత అవసరాలు, ఇతర వాటికి పోనూ 4లక్షల మె.టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈసారి సన్నధాన్యం క్వింటాలుకు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుండటంతో వాటి కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

జిల్లాలో వరి సాగు ఇలా(ఎకరాల్లో)...	
సన్న రకం:	దొడ్డు రకం:
1,04,970	1,92,365


మెదక్ మండలం తిమ్మక్కపల్లిలో నేలవాలిన వరి

చేతికొచ్చిన దశలో ..

అన్నదాతలు కోతలు మొదలుపెట్టారు. 17 శాతం తేమ వచ్చేందుకు కొనుగోలు కేంద్రాలు, రహదారులపై ఆరబోస్తున్నారు. ఈ క్రమంలో అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మెదక్, హవేలీఘనపూర్, రామాయంపేట, చేగుంట, నార్సింగి, వెల్దుర్తి, పాపన్నపేట తదితర మండలాల్లో చేతికొచ్చిన వరి పొలంలోనే నెలకొరుగుతోంది. కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోతోంది. మెదక్ పట్టణం పిల్లికొట్టాల్ మండల పరిధి చిట్యాల, ఇతర ప్రాంతాల్లో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రస్తుతం ధాన్యం కోతలకు వరికోత యంత్రం గంటకు రూ.2,800 నుంచి రూ.3 వేల వసూలు చేస్తున్నారు. వర్షాలు ఇదే విధంగా కురిస్తే చెయిన్ కోత మిషన్ గంటకు రూ.3,200 నుంచి రూ.3,500 వరకు పెంచే అవకాశం ఉందని అన్నదాతలు వాపోతున్నారు.

ఏర్పాటు చేయాల్సిన కొనుగోలు కేంద్రాలు: 497	
ఇప్పటి వరకు ఏర్పాటు చేసినవి: 300	కొనుగోలు చేసిన ధాన్యం: 0

షురూ కానీ కొనుగోళ్లు...

విపణిల్లోకి ధాన్యం వస్తున్నా కొనుగోళ్లు ఇంకా షురూ కాలేదు. జిల్లా వ్యాప్తంగా 89 సన్నరకం, 408 దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 300 కేంద్రాలు అందుబాటులోకి వచ్చినా కొనుగోళ్లు మొదలుకాలేదు.

నిబంధనల మేరకు కొంటాం

నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం. 300 కేంద్రాలు ప్రారంభించాం. తేమ శాతం తక్కువ ఉండి, తాలు లేకుండా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి గోదాముల్లోకి చేరవేస్తాం.
హరికృష్ణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

పెట్టుబడి వచ్చేలా లేదు...



సోమవారం కురిసిన భారీ వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయింది. కేంద్రానికి వడ్లు తెచ్చి ఎనిమిది రోజులవుతోంది. ఆరబెట్టిన వడ్లు కొట్టుకుపోతున్నాయి. టార్పాలిన్లు కూడా ఇవ్వడం లేదు. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు.
బాగయ్య, చిట్యాల, మెదక్ మండలం

నష్టపరిహారం చెల్లించాలి...



భారీ వర్షానికి ఆరబోసిన ధాన్యం నేలపాలైంది. ఐదు నెలలుగా పడిన కష్టం వృథా అయింది. కొట్టుపోయిన ధాన్యానికి నష్టపరిహారం చెల్లించాలి.
లింగమ్మ, చిట్యాల, మెదక్ మండలం

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి: ఎస్పీ


సైకిల్ ర్యాలీలో ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

మెదక్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు, సమాజసేవలో శాంతిభద్రతల పట్ల పోలీస్ సిబ్బంది నిబద్ధతతో ఉన్నారని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మెదక్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద ఎస్పీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా, రాందాస్ చౌరస్తా వరకు కొనసాగింది. శిరస్త్రాణం ధరించడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని అన్నారు. సైకిల్ ర్యాలీలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్నకుమార్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్, సీఐలు నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి పోలీస్‌శాఖ కృషి చేస్తుందని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ జైపాల్ కుటుంబ సభ్యులకు పోలీసు భద్రత పథకం ద్వారా రూ.8 లక్షల చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు ఎస్పీ అందజేశారు.

తడిసిన ధాన్యం కొనాల్సిందే: భారాస


పాతూర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

చిన్నశంకరంపేట, మెదక్ రూరల్, న్యూస్‌టుడే: అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయి అన్నదాత తీవ్రంగా నష్టపోయాడని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని భారాస జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల పరిధి సూరారం, మెదక్ పట్టణ పరిధిలోని ఔరంగాబాద్, అవుసులపల్లి, పాతూరులో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. చివరి గింజ వరకు కొనకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేస్తామన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో ఫోన్లో మాట్లాడి.. నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలని కోరారు. అనంతరం భాగిర్తిపల్లిలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు లావణ్య రెడ్డి, బట్టి జగపతి, మున్సిపల్ కౌన్సిలర్లు కిషోర్, విశ్వం, జయరాజు, అంజాగౌడ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

వారధి.. ఉపయోగం లేదది..

అనుసంధాన రోడ్డులేక నిరుపయోగం


నిర్మాణం పూర్తయినా.. ఉపయోగంలో లేని వంతెన

పాపన్నపేట, న్యూస్‌టుడే: రెండు జిల్లాల గ్రామాల మధ్య నదిపై వంతెన నిర్మించినప్పటికీ అది అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మెదక్, కామారెడ్డి జిల్లాల సరిహద్దుల్లో మంజీరా నది ప్రవహిస్తోంది. నదికి ఇటువైపు మెదక్ జిల్లా పాపన్నపేట మండలం అటువైపు కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం ఉన్నాయి. ఏదైనా పనుల నిమిత్తం అక్కడి వారు ఇక్కడికి రావాలంటే మెదక్, ఎల్లారెడ్డిల మీదుగా సుమారు 40కిలోమీటర్లు చుట్టూ తిరిగిరావాలి. దీంతో రవాణా భారం అధికమవుతోంది. ఏడుపాయల వనదుర్గమ్మ దర్శనానికి నిత్యం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి భక్తులు వస్తుంటారు. వారికి కూడా ఈ మార్గం అనువుగా ఉంటుంది. రాంతీర్థం వైపు రోడ్డు పనులు పూర్తైతే సుమారు 40కిలోమీటర్ల దూర భారం తగ్గుతుంది.

ప్రతిపాదనలు పంపించాం...
-వెంకటేశం, డీఈ, ర.భ.శాఖ, మెదక్

రాంతీర్థం వైపు వంతెన నుంచి పాపన్నపేట వరకు నిర్మించాల్సిన అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనుల నిధుల కోసం అవసరమైన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

ఏళ్లుగా కలగానే

రెండు జిల్లాలను కలుపుతూ మంజీరా నదిపై వంతెన నిర్మించాలని ఏళ్ల నుండి డిమాండ్ ఉంది. ఇది పూర్తయితే మెదక్ జిల్లాలోని పాపన్నపేట, టేక్మాల్, పెద్దశంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గం, తదితర మండలాలు, కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట, లింగంపేట, ఎల్లారెడ్డి, తదితర మండలాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. గత ప్రభుత్వం వంతెన నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం రాంతీర్థం, కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లి గ్రామాల మధ్య అనువుగా ఉంటుందని భావించి 2017లో సుమారు రూ.18కోట్లతో మంజీరానదిపై 320మీటర్ల వంతెన నిర్మాణ పనులు చేపట్టి.. మూడేళ్ల క్రితం పూర్తిచేశారు. వెంకంపల్లి వైపు వంతెన నుంచి తాండూరు గేటు వరకు రూ.20 కోట్లతో 5.75కి.మీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ రాంతీర్థం వైపు రోడ్డు పనులు చేపట్టకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు.

మార్గం నిర్మిస్తే ప్రయోజనం...

రాంతీర్థం వైపు వంతెన నుంచి పాపన్నపేట వరకు రాంతీర్థం, ముద్దాపూర్ గ్రామాల మధ్య నుంచి సుమారు 3.1కి.మీ అనుసంధాన రోడ్డు నిర్మించాల్సి ఉంది. దీనికోసం సుమారు 15ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. భూసేకరణ పరిహారం, అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి రూ.22కోట్లు అవసరమవుతాయని ర.భ అధికారులు అంచనావేసి ప్రతిపాదనలు పంపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పనులు త్వరగా చేపట్టాలని ఇరు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

పథకాల అమలు పరిశీలించిన శిక్షణ అధికారులు


ప్రగతి ధర్మారంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న శిక్షణ అధికారులు

రామాయంపేట, మనోహరాబాద్, తూప్రాన్, కౌడిపల్లి, నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: సివిల్ సర్వీసెస్ శిక్షణా అధికారులు మంగళవారం పలు గ్రామాలను సందర్శించారు. ప్రగతి ధర్మారం ఉన్నత పాఠశాలలో పాఠ్యాంశాలు, మధ్యాహ్న భోజన పథకం వివరాలు తెలుసుకున్నారు. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో యువకులు స్వచ్ఛభారత్‌లో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. తూప్రాన్ మండలం మల్కాపూర్, కౌడిపల్లి మండలం రాయిలాపూర్‌లో సంక్షేమ పథకాల అమలుపై ప్రజలతో మాట్లాడారు. నర్సాపూర్ మండలంలోని అవంచలో పల్లె ప్రకృతివనం, నర్సరీ, క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు.

ఉద్యోగులపై నిర్లక్ష్య వైఖరి తగదు


కలెక్టరేట్ లో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మెదక్, న్యూస్‌టుడే: ఉద్యోగులకు రావాల్సిన ఐదు విడతల కరవు భత్యం, అన్ని రకాల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ దొంత నరేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఐకాస ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య ధోరణి విడనాడాలని అన్నారు. ధర్నాలో ఐకాస స్టీరింగ్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, మహేందర్ గౌడ్, ప్రణీద్ కుమార్, సంగయ్య, జగదీష్ చంద్ర, జయకర్, టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, జిల్లా ఉపాధ్యక్షులు ఫజులుద్దీన్, ఉపాధ్యాయ సంఘం నాయకులు వెంకట్రాంరెడ్డి, యాదగిరి, హీరాలాల్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు పరమేష్, లక్ష్మణ్, అలీ, శ్రీహర్ష పాల్గొన్నారు.



రేణుకాంబా నమోస్తుతే...

మెదక్ అర్బన్: మెదక్ పట్టణ పసుపులేరు ఒడ్డున ఉన్న రేణుకాంబ ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. భక్తులు భారీగా పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు: ఎమ్మెల్యే

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంత ధాన్యం తడిసిందో వ్యవసాయశాఖ అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారని, దానిని ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు.

26, 29వ తేదీల్లో సదరం శిబిరం

మెదక్, న్యూస్‌టుడే: దివ్యాంగులను గుర్తించి అర్హులకు సదరం ధ్రువీకరణ పత్రం అందించేందుకు ఈ నెల 26, 29వ తేదీల్లో శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు మీ-సేవ, ఈ-సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకొని రసీదులో కేటాయించిన రోజున రావాలని సూచించారు. మెదక్‌లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందని తెలిపారు.

సర్కారు ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యం

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: సర్కారు ఆసుపత్రిలో పేదవాడికి అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డీఎంహెచ్‌వో శ్రీరామ్ తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేటలోని పీహెచ్‌సీని తనిఖీ చేసి ప్రయోగశాల, ఓపీ గదిని పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగం అభివృద్ధికి పెద్దపీట వేసిందని, జిల్లా వ్యాప్తంగా ఉన్న 152 వైద్య ఉప కేంద్రాలను 92 ప్రాథమిక వైద్య కేంద్రాలుగా మార్చామన్నారు. వచ్చేనెల నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రత్యేక వైద్యుడు పీహెచ్‌లో ఉండనున్నట్లు తెలిపారు. 12రకాల వైద్యసేవలు, సిటీ స్కాన్, ఈసీజీ, 56రకాల పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు నవీన్‌కుమార్, మండల వైద్యాధికారి సాయి సింధూ, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్సీ వెంటనే ప్రకటించాలి: తపస్


రామాయంపేటలో నిరసన తెలుపుతున్న తపస్ బాధ్యులు, ఉపాధ్యాయులు

తూప్రాన్, రామాయంపేట, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న డీఏలను, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. మంగళవారం తూప్రాన్, రామాయంపేటలో ఆందోళన చేపట్టారు. జిల్లా అధ్యక్షులు జిడ్డి ఎల్లంతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న తహసీల్దార్ కార్యాలయాల వద్ద, నవంబర్ 5న కలెక్టరేట్ల వద్ద, నవంబర్ 23న ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, మండల ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని తపస్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు కోరారు. మంగళవారం మిర్జాపల్లిలో నిరసన వ్యక్తం చేశారు.

24న ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మెదక్ అర్బన్: ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన మెదక్ పట్టణంలోని మైదానంలో సీనియర్ పురుషుల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9347344440, 77300 50873 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అత్యధిక సభ్యత్వ నమోదే లక్ష్యం: భాజపా


మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: భాజపా అత్యధిక సభ్యత్వాల నమోదే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైరి శంకర్ అన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదులో జిల్లాను ముందు వరుసలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్ పాల్గొన్నారు.

పేరుకుపోతున్న వడ్డీ బకాయిలు

● మహిళా సంఘాల ఎదురు చూపులు

పెద్దశంకరంపేట, మెదక్, న్యూస్‌టుడే: రుణాలకు చెల్లించిన వడ్డీ తిరిగి సంఘాలకు జమ కాకపోవడంతో మహిళా సంఘాలు వడ్డీ భారం మోస్తున్నారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేకుండా రుణాలను అందిస్తున్నామని వడ్డీ ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు చెబుతున్నా.. సకాలంలో అందడం లేదు. సభ్యులకు ఏటా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద నిర్దేశించిన లక్ష్యం మేరకు రుణాల పంపిణీ జరుగుతోంది. రుణాలు పొందిన మహిళా సభ్యులు నెలనెలా రుణ వాయిదాలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేయాల్సిన వడ్డీ డబ్బులు తమ ఖాతాల్లో ఎప్పుడు జమవుతాయని ఎదురుచూస్తున్నారు. జిల్లాలో రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోతున్నాయి.

జిల్లాలో ఇలా సంవత్సరం	సంఘాలు	రావాల్సిన వడ్డీ రాయితీ (రూ.కోట్లలో)
2020-21	10,771	33.44
2021-22	11,742	37.89
2022-23	11,600	27.18
2023-24	8,784	11.95
2024-25 (అక్టోబర్ 21వరకు)	9,383	6.43


మహిళా సంఘ సమావేశం

రూ.కోట్లలో పేరుకుపోయి..

రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వడ్డీ రాయితీ నిధులు విడుదల కాకపోవడం మహిళలపై ప్రభావం చూపుతోంది. దీంతో బ్యాంకు లింకేజీ ద్వారా అప్పు తీసుకోవాలంటేనే వెనకడుగు వేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 మార్చిలో వడ్డీ రాయితీ నిధులను విడుదల చేసింది. కానీ 2023 డిసెంబర్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు మూడు నెలలకు సంబంధించి మాత్రమే నిధులను విడుదల చేసింది. ఇందులో మెదక్ జిల్లాలోని 7,953 సంఘాలకు కేవలం రూ.8.92 కోట్ల నిధులు మాత్రమే విడుదలయ్యాయి. మళ్లీ ఇప్పటి వరకు ఎలాంటి వడ్డీ నిధులు విడుదల కాలేదు. 2020 నుంచి జమ కాక.. మహిళలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటి వరకు గత ఐదేళ్లలో రూ.116.89 కోట్ల వడ్డీ రాయితీ విడుదల కావాల్సి ఉంది. నిధులను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

సంఘాలపై భారం

సంధ్య, సభ్యురాలు, తిర్మలాపురం



వడ్డీ నిధులు సంఘాలకు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సంఘాల్లో మహిళలకు భారంగా మారుతోంది. త్వరగా విడుదల చేస్తే ఎంతో కొంత వెసులుబాటు కలుగుతుంది. కిస్తీలు కట్టకపోతే వెంటబడి కట్టిస్తారు. మాకు వచ్చే వాటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.



నేనేం తప్పు చేశానమ్మా..
నెలల పాటు గర్భంలో
నన్ను మోశావు..
ఈ లోకంలోకి తీసుకొచ్చి అనాథగా
వదిలేశావు..
జన్మనిచ్చిన నిన్ను కళ్లారా చూసుకునే
అవకాశమే ఇవ్వలేదు..
అన్నింటినీ నేర్పించే అమ్మ ఒడిని దూరం చేశావు..
నెలలు నిండకుండానే పుట్టడం నా తప్పు కాదుగా..
అయినా దిక్కులేని వాణ్నిగా వదిలేశావని..
ప్రశ్నిస్తున్నాడు ఈ నవజాత శిశువు. సిద్దిపేట పట్టణంలో
జరిగిన ఈ ఘటన చూపరులను కంటతడి పెట్టించింది.

నెలలు నిండకుండా పుట్టడం నా తప్పా?

నవజాత శిశువును ఊయలలో వదిలెళ్లిన తల్లి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట సర్వజన ఆస్పత్రిలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మగశిశువును వదిలేసి వెళ్లిపోయారు. రోగుల బంధువులు కొంతసేపటికి చూసి వైద్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే శిశువును అత్యవసర చికిత్సకు తరలించారు. నెలలు నిండకుండానే పుట్టడంతో కేవలం 900 గ్రాముల బరువు మాత్రమే ఉన్నాడని, ఆయాసంతో బాధపడుతున్నాడని.. అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సురేఖాబాయి తెలిపారు. పసిబిడ్డకు సీపాప్ ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. వైద్యులు రాణీ, నిఖిత ఆస్పత్రి సిబ్బంది అలియా, ఖాజాబీ బాగోగులు చూస్తున్నారు. వైద్యులిచ్చిన సమాచారంతో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు రాము, రాజారాం వచ్చి పరిశీలించారు. శిశువు ఆరోగ్యం కుదుట పడ్డాక శిశుగృహానికి తరలిస్తామన్నారు.

కాపాడిన 'ఊయల'

కొంతమంది తల్లులు పిల్లలను చెత్తకుండీలు, ముళ్ల పొదల్లో పడేసి వెళ్లిన ఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో సిద్దిపేటలో మహిళా, శిశు వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ చేసిన ఓ ఆలోచన పసిప్రాణాన్ని కాపాడింది. చిన్నారులను పెంచలేక పోతే.. ఎక్కడో పారేయకుండా ఆవరణలో ఊయలలో వేయండి.. అని ఆసుపత్రి వద్ద ఫ్లెక్సీ రాసి పెట్టారు. ఇప్పుడే ఆ నవజాత శిశువుకు తల్లి ఒడి అయింది.



పరీక్షిస్తున్న వైద్యుడు

సేంద్రియ సస్యరక్షణపై అవగాహన

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కంది, శనగ సాగులో సేంద్రియ సస్యరక్షణ చర్యలు మేలని జహీరాబాద్ డీడీఎస్-కృషి విజ్ఞాన కేంద్రం పంటల యాజమాన్య శాస్త్రవేత్త డా. రమేష్ అన్నారు. మండలంలోని ఐటెలగడ్డ తండా, జీడిగడ్డ తండాలో మంగళవారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. కంది, శనగ పైరుల్లో లింగాకర్షణ బుట్టలు, వేప నూనె కషాయం వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.

గంజాయిని.. వేళ్లూనుకోనివ్వద్దు!

గట్లపై సాగు..



మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శెట్టిపల్లికలాన్‌లో ఎలబోయిన భూపాల్ పొలంలోని గట్లపై గంజాయి మొక్కలు సాగు చేశాడు. విశ్వసనీయ సమాచారంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేశారు.



సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మర్వెల్లిలో ఒకరు తన పొలంలో పత్తి, మిరప అంతర పంటగా గంజాయి సాగు చేశారు. విషయం తెలుసుకున్న ఆబ్కారీ పోలీసులు 20 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. న్యాల్‌కల్‌లోనూ ఇలాంటి ఘటనే జరిగింది.

ప్రమాదంలో బయటపడి..



హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న ఓ కారు మెదక్ జిల్లా రామాయంపేట శివారులో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. పోలీసులు దాన్ని గుర్తించి తనిఖీ చేయగా 80 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది.

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, వెల్దుర్తి, సిద్దిపేట, మెదక్, వికారాబాద్, రామాయంపేట

గంజాయి సాగు.. సరఫరా.. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో నిత్యకృత్యంగా మారింది. ఆబ్కారీ యంత్రాంగం తనిఖీలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. దొరికితే దొంగ.. లేదంటే రాజా అన్న చందంగా దందా యథేచ్ఛగా సాగుతోంది. ఆరోగ్యానికి హాని చేసే ఈ మత్తుకు యువత, కార్మికులు, విద్యార్థులు ఆకర్షితులవుతూ జీవితాలను పణంగా పెడుతున్నారు. కొన్ని ముఠాలు ఆయా వర్గాల లక్ష్యంగా చేసుకొని పొట్లాలు, చాక్లెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. పలు సందర్భాల్లో ఇది రుజువైంది. ఈ తరుణంలో దీని కట్టడి లక్ష్యంగా అదుపు చేయాల్సిన అవసరం ఉంది.

తగ్గేదే.. మళ్లీ పెరిగి..

2014కు ముందు సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్ నియోజకవర్గంలో అత్యధికంగా గంజాయి సాగు చేసేవారు. అప్పటి ప్రభుత్వం స్వయం ఉపాధి కింద రుణాలు ఇచ్చి రైతులను సాగు మాన్పించేలా చేసింది. మళ్లీ ఇటీవల దీని సాగు పెరిగింది. ఇటీవల నాలుగు జిల్లాల్లోని నారాయణఖేడ్, రాయికోడ్, మునిపల్లి, న్యాల్‌కల్, వెల్దుర్తి తదితర మండలాల్లో ఆబ్కారీ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. పలువురు పొలం గట్లపై సాగు చేస్తుండటం అందోళనకరం. గిరిజన తండాల్లో పెరుగుతోంది. గంజాయి రవాణా, అమ్మకాలకు ఒడిశా, విశాఖ ఏజెన్సీ నుంచి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. సంగారెడ్డి జిల్లాలో 46 మంది రైతులను ఈ కారణంగానే రైతుబంధు నిలిపివేశారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోనూ గంజాయి సాగు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఏజెన్సీ, ఒడిశా నుంచి జిల్లాల మీదుగా సరఫరా అవుతోంది. ఆయా ముఠాలు అందుబాటులో గంజాయిని పొట్లాలుగా తయారుచేసి పోలీసుల కళ్లుగప్పి రవాణా చేస్తున్నారు.

నియంత్రణపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో గంజాయి సాగు, అక్రమ దందా నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించాం. జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, స్టేషన్ హౌస్ అధికారి ఆధ్వర్యంలో తరచూ తనిఖీలు చేపడుతున్నాం. అవసరమైన చెక్‌పోస్టుల ఏర్పాటు, సరిహద్దుల్లో నిఘా ద్వారా కట్టడి చేస్తున్నాం.

– నవీన్ చంద్ర, జిల్లా ఆబ్కారీ శాఖ అధికారి, సంగారెడ్డి

కొత్త పద్ధతుల్లో..



కూరగాయల వాహనం దిగువన...

నాలుగు జిల్లాల్లో జిన్నారం, ఐడీఏ బొల్లారం, హత్నూర, మనోహరాబాద్, చిన్నశంకరంపేట, చేగుంట, తూప్రాన్ తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో నివసిస్తున్న ఇతర రాష్ట్రాల వారికి పలువురు గంజాయి సరఫరా చేస్తున్నారు. దీన్ని సాగు చేసే సులభంగా సరఫరా చేయడంతో పాటు డబ్బులు సంపాదించవచ్చని పలువురు సాగు బాట పట్టారు.

- ఆబ్కారీ, సివిల్ పోలీసులకు అనుమానం రాకుండా వాహనాల్లో అరలు తయారు చేసి అందులో తరలిస్తున్నారు.

నాలుగు జిల్లాల్లో గంజాయి కేసులు (జనవరి నుంచి గత సెప్టెంబరు 30 వరకు)

	సంగారెడ్డి	సిద్దిపేట	మెదక్	వికారాబాద్
కేసులు	71	02	14	73
అరెస్టైనది	108	03	20	148
స్వాధీనం చేసుకున్న మొక్కలు	441	26	57	45
దొరికిన ఎండు గంజాయి	620.16 కిలోలు	240 గ్రాములు	1.185 కిలోలు	140 కిలోలు
విలువ	రూ. 15,50,4,000	రూ. 29,625	రూ. 2,60,890	రూ. 6,10,000

చైతన్యం.. అధ్యయనం..

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి గ్రామీణ, సదాశివపేట, కంది



శ్రమదానం చేస్తున్న విద్యార్థినులు

వారంతా నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు.. సామాజిక అంశాలపై చైతన్యం తేవడమే లక్ష్యంగా, గ్రామీణ జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు గ్రామాల బాట పట్టారు. అక్కడే ఉంటూ ప్రజలతో మమేకం అయ్యారు. వ్యాధులు, పోషక లోపం, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై పల్లెవాసుల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. మరోవైపు గ్రామాన్ని శుభ్రం చేశారు. సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులను రైతులకు అవగాహన కల్పించడం విశేషం.

128 మంది విద్యార్థులు..

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 128 మంది విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఈ నెల 16 నుంచి 22 వరకు సంగారెడ్డి మండలం పసల్‌వాదిలో సంగారెడ్డి మండలం పసల్‌వాది వచ్చారు. అధ్యాపకుల పర్యవేక్షణలో సామాజిక సేవలో పాల్గొన్నారు. రోజువారీగా కార్యక్రమాలు చేపట్టారు.

గ్రామీణ జీవనంపై సర్వే..

గ్రామీణుల జీవనాన్ని తెలుసుకునేందుకు ముందుగా సర్వే చేశారు. ఏ పంట ఎంత మంది పండిస్తున్నారు, రోగాల తీరు, ప్రధాన సమస్యలు, తాగునీటి లభ్యత, తదితర వివరాలపై సర్వే చేశారు. ఆయా వివరాలను సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. స్థానిక చెరువు కర్మాగారాన్ని సందర్శించారు. దిగుబడి, చక్కెర ఉత్పత్తి తీరు, తదితర అంశాలు తెలుసుకున్నారు.

అవగాహన కార్యక్రమాలు..

భూసార పరీక్షల ప్రాధాన్యాన్ని రైతులకు వివరించారు. రసాయనాల వినియోగంతో కలిగే నష్టాలు, సేంద్రియ ఎరువులతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తుమందు ఇతర వాటితో కలిగే అనర్థాలపై ర్యాలీలు నిర్వహించారు. ఈ మేరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ పెంపకం ప్రోత్సహించారు. వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య కేంద్రాల శాస్త్రవేత్తలతో సూచనలు ఇప్పించారు.

ఎన్నో విషయాలు తెలుసుకున్నా



– ఎస్.అజయ్‌కుమార్, విద్యార్థి

క్షేత్రస్థాయిలో ఎన్నో విషయాలు తెలుసుకున్నా. గ్రామంలో అత్యధికంగా వరి, పత్తి, చెరకు, కూరగాయలు సాగు చేస్తున్నారు. మంజీర నది పరివాహక ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. ప్రజల జీవనస్థితిగతులు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది.

సంతోషంగా ఉంది



– వి.సుష్మస్వరాజ్, విద్యార్థిని

సామాజిక సేవలో పాల్గొనడం సంతోషంగా ఉంది. నాలుగేళ్లగా తరగతి గదులకు పరిమితం అయ్యాం. తొలిసారిగా పల్లెటూరికి వచ్చి ఇక్కడి వారి జీవన స్థితిగతులు తెలుసుకున్నా. పలు అంశాలపై అవగాహన కల్పించాం.



ఐఎస్‌వో ధ్రువపత్రాలను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపక బృందం

సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు

సిద్దిపేట: సిద్దిపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఐఎస్‌వో గుర్తింపును పొందింది. పచ్చదనం, విద్యుత్ పొదుపు, పాలన, వసతులు, ఈ-వ్యర్థాల నిర్వహణ, ఇతర అంశాల ప్రాతిపదికన మూడు ఐఎస్‌వో ధ్రువపత్రాలను మంగళవారం అందుకున్నారు. ఆయా అంశాలపై ఐఎస్‌వో బృందం ప్రత్యక్షంగా తనిఖీ చేసి ప్రదానం చేయడం విశేషం. ప్రిన్సిపల్ జీవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ శ్యామ్, అధ్యాపకులు హర్షం వ్యక్తంచేశారు.

సైక్లింగ్‌లో సత్తా చాటిన అన్నాదమ్ముళ్లు



అందుకున్న పతకాలు, సర్టిఫికెట్లతో అమిత్, సుమిత్

హుస్నాబాద్ (గ్రామీణం), న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్లంపల్లికి చెందిన అన్న, తమ్ముడు ఇద్దరు సూరంపల్లి అమిత్, సుమిత్ సైక్లింగ్ పోటీల్లో సత్తా చాటారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 8వ రాష్ట్ర స్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీలు గత వారం జరిగాయి. అండర్-16 బాలుర వ్యక్తిగత 5 కి.మీ విభాగంలో అమిత్ విజేతగా నిలిచి బంగారు పతకం, సుమిత్ రెండో స్థానంతో రజత పతకం సాధించినట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుందారుపల్లి శ్రీనివాసులు, జంగాపల్లి వెంకటనర్సయ్య తెలిపారు. ఇద్దరిని సైక్లింగ్, యోగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్లారెడ్డి, మనోహర్, సాయ్ డైరెక్టర్ చంద్రారెడ్డి, విజయకాంతారావు, కోచ్‌లు విజయభాస్కర్‌రెడ్డి, సంజీవ్ అభినందించారు.

పిల్లల పండగ గోడపత్రిక ఆవిష్కరణ



జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ పట్టణంలో నవంబర్ 10న 'జహీరాబాద్ పిల్లల పండగ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహణ కన్వీనర్ డా.విజయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని గ్రామీణ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం పిల్లల పండగ గోడపత్రికను విజ్ఞాన కేంద్రం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. మూడు కేటగిరీల్లో 30కి పైగా ఈవెంట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు రాంచందర్, శివబాబు, మహిపాల్, వెంకటేష్, పూలమ్మ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసుకుని వేదన మిగిల్చి..

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని యువతి..



అర్చన

జగదేవపూర్: ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం అనంతసాగర్ గ్రామంలో జరిగింది. ఎస్సై జగ్గన్ తెలిపిన వివరాలు.. దాసరి అర్చన (18) గజ్వేల్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమిస్తోంది. విషయం గ్రహించిన తల్లిదండ్రులు మరో సంబంధం వెతికి పెళ్లికి ఒప్పించారు. అర్చన తల్లిదండ్రులు మంగళవారం పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి ఉరి వేసుకుంది. తల్లిదండ్రులు మధ్యాహ్నం ఇంటికొచ్చేసరికి తలుపు పెట్టి ఉంది. స్థానికుల సహాయంతో తలుపులు పగుల గొట్టి లోపలికి వెళ్లి చూడగా ఉరేసుకుని మృతి చెంది కనిపించింది. యువతికి తల్లిదండ్రులు, ఇద్దరు అక్కాచెల్లెళ్లు, ఒక సోదరుడు ఉన్నారు. ఈ కుటుంబంలో అర్చన ద్వితీయ సంతానం. తల్లి మల్లమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

భూమి ఇవ్వలేదని మనస్తాపానికి గురై..

సదాశివపేట: మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తంగడపల్లిలో రెండు రోజుల కిందట జరిగింది. మంగళవారం వెలుగులోకి వచ్చింది. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన సిరిపురం రాములు(33)కు వాటాకు చెందిన భూమి ఇవ్వాలని తల్లిదండ్రులను కోరగా ఇవ్వలేదు. బావ, చెల్లెలు కూడా అంగీకరించలేదు. దీంతో మనోవేదనకు గురై గ్రామశివారులో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో పెద్దల సమక్షంలో భూ పంచాయితీ తేల్చేవరకు మృతదేహాన్ని తరలించవద్దని రాములు బావమరిది పట్టుబట్టాడు. దీంతో రెండు రోజులుగా మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచారు. మంగళవారం పెద్దల సమక్షంలో ఒప్పందం కుదరడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యానికి బానిసై యువకుడు..

కర్జెర్, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కర్జెర్ మండలంలోని మానసిపల్లి గ్రామానికి చెందిన నిజాంపేట్ శరత్(30) పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వెంకటేశం తెలిపారు. శరత్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గ్రామంలో మెడికల్ దుకాణం పెడతానని, డబ్బులు ఇవ్వాలంటూ తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. గతంలో చేయి కోసుకొని బెదిరించాడు. సోమవారం సాయంత్రం తల్లిని డబ్బులు డిమాండ్ చేయగా వారు అంగీకరించలేదు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సిద్దిపేట తల్లాత్ గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం తను నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్సై వివరించారు. తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అభినవ.. ద్రోణాచార్య!

ఈనాడు, ఈనాడు డిజిటల్ – అమరావతి: ఒక వినూత్న ఆలోచన.. సమాజం పురోభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు దోహదపడుతుంది. నిత్య జీవితంలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది. కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి ఎంతో ఉపయోగపడుతోంది. భవిష్యత్తులో పలు రంగాల్లో డ్రోన్ టెక్నాలజీ కీలక మార్పులు తీసుకురానుంది. ఇప్పుడిప్పుడే అనేక అవసరాలకు డ్రోన్లు అక్కరకొస్తున్నాయి. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలు, వివిధ అవసరాలకు ఉపయోగపడే డ్రోన్లు, వాటిల్లో నూతన సాంకేతికత, అభివృద్ధిలో



డ్రోన్ల పాత్ర, తదితర అంశాలతో పాటు భవిష్యత్తు మార్గదర్శిపై ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా మంగళగిరిలో 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ప్రారంభమైంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు, సందర్శకులు భారీగా పాల్గొన్నారు.

సొంతంగా ఎదగాలనే స్టార్టప్

– పురందర్, ఎంటెక్, ఐఐటీ హైదరాబాద్

నాకు విదేశీ వస్తువులంటే పెద్దగా ఇష్టం ఉండదు. దేశీయంగా తయారు చేయాలనే పట్టుదలతోనే స్టార్టప్ నెలకొల్పాను. నేను అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ చదివాక హైదరాబాద్ ఐఐటీలో ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేశా. ఐఐటీ ప్రాంగణంలో ఉన్న టింకర్ల్యాబ్‌లో ఎక్కువ సమయం గడిపా. అక్కడే సొంతంగా రోబోటిక్ చేయి తయారీకి చాలా కష్టపడ్డా. ఆ ప్రయోగం విఫలమైంది. ఇది నాలో పట్టుదల పెంచింది. డ్రోన్ ప్రాజెక్టుకు 'ఐమని అటోమేషన్, కృత్రిమ మేధస్సు 'ఎక్స్ స్కార్ పిల్' అనే స్టార్టప్ ఏర్పాటు చేశాను. డ్రోన్ల నియంత్రణకు ఎలక్ట్రానిక్ స్పీడ్ కంట్రోలర్ (ఈఎస్సీ) పరికరాలు సొంతంగా తయారుచేస్తున్నా. నిపుణుల బృందం సహకారంతో ఆర్డర్లు తీసుకుని సరఫరా చేస్తున్నా. వచ్చిన లాభంలో వారికి వాటా ఇస్తున్నా. భవిష్యత్తులో రోబోటిక్స్‌లో పరిశోధనలపై దృష్టి సారిస్తా. సాంకేతిక పరిజ్ఞానంతో ఐయోమెడికల్ తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా.

పట్టణ ప్రణాళికకు డ్రోన్ సర్వే

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్, పరిగి, తాండూరు

పట్టణ రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగేస్తోంది. ఇందుకు పట్టణ ప్రణాళికను పక్కాగా, దీర్ఘ రూపొందించాలని ఆదేశించింది. ఇందుకు సంబంధిత అధికారులు సాధారణంగా అన్ని వార్డులు తిరిగి సర్వే చేపడుతుంటారు. వికారాబాద్ జిల్లాలో మాత్రం కొత్తగా డ్రోన్ ద్వారా సర్వేకు శ్రీకారం చుట్టడం విశేషం. జిల్లాలోని వివిధ అవసరాల మేరకు ఇందులో లక్ష్యంగా ఆధునిక సాంకేతికను వినియోగిస్తుండటం విశేషం.



వికారాబాద్ పట్టణంలో సర్వే ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పుర అధ్యక్షురాలు మంజుల తదితరులు

జిల్లాలో ఇలా

పురపాలిక	జనాభా	వార్డులు
తాండూరు	71,008	38
వికారాబాద్	63,646	34
పరిగి	18,242	15
కొడంగల్	14,519	12

డ్రోన్లు వినియోగిస్తున్నారు. 5 మంది సాంకేతిక, 10 మంది పుర సిబ్బంది రెండు బృందాలుగా వీడి ఇందులో పాల్గొంటున్నారు. వికారాబాద్ 122 ఎకరాల్లో ఏర్పాటైన కె.మీ. మేర విస్తరించి ఉండగా, కన్నర్లు వారీగా విభజించి

10 రోజుల పాటు..

వికారాబాద్‌లో ఈ నెల 16న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పుర అధ్యక్షురాలు మంజుల ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే ప్రారంభించారు. పట్టణంలో ఈ నెల 25 వరకు ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకు గాను 2

క్రోడీకరించి నివేదిక..

కేంద్రం అమృత్ 2.0 కింద డ్రోన్ కెమెరాలతో సర్వే ఎంపిక చేసింది. వీటి ద్వారా సేకరించిన సమాచారం, చిత్రాలను క్రోడీకరించి నివేదిక రూపొందిస్తారు. రానున్న 30-40 ఏళ్లలో అభివృద్ధికి తగ్గట్టుగా ప్రణాళిక తయారుచేస్తారు. ప్రస్తుతం ఏళ్ల కిందట రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఇప్పటికీ కొనసాగుతోంది. పట్టణానికి కొత్త రూపు వచ్చేలా డ్రోన్ సర్వే దోహదపడనుంది. అభివృద్ధికి డ్రోన్ యంత్రం చిత్రాల జేస్ మ్యాప్ కీలకంగా మారనుంది. ఇప్పటికే వికారాబాద్, పరిగిలో ఈ కొత్త సర్వే మొదలవగా, తాండూరులో 26 నుంచి చేపట్టనున్నారు. 2050కి దృష్టిలో పెట్టుకొని మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నారు.

100 పాయింట్లు నిర్దేశించారు. అక్కడి నుంచి డ్రోన్ సాయంతో దాని పరిధిలోని ప్రాంతాన్ని చిత్రీకరిస్తారు. ఎత్తైన రోడ్లు, ఖాళీ ప్రదేశం ఉంది, నిర్మాణాలు ఎక్కడ ఉన్నాయి, ప్రభుత్వ కార్యాలయాలు, వీధి దీపాలు, పార్కులు, తాగునీటి పైపులైన్లు, సెల్ టవర్లు, తాగునీటి రిజర్వాయర్లు, వైకుంఠధామం, తదితర వాటన్నింటి జీపీఎస్ సేకరించి బేస్ మ్యాప్ రూపొందిస్తారు.

క్షుణ్ణంగా పరిశీలించి.. రాకేశ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్, వికారాబాద్

పట్టణంలో డ్రోన్ యంత్రాలతో ఈనెల 25 వరకు సర్వే నిర్వహిస్తారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక రూపొందిస్తారు. రానున్న 30 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని దీన్ని తయారుచేయనున్నాం. ఆ మేరకు అభివృద్ధి చేయల్సిన తీరుపై విశ్లేషిస్తాం.

రైతులను బలిగొన్న విద్యుత్తు తీగ



విద్యుత్తు తీగ తగిలి మృతిచెందిన శివశంకర్

వట్‌పల్లి, న్యూస్‌టుడే: అడవి పందుల బెడద నుంచి వరి పంటను కాపాడుకునేందుకు వేసిన విద్యుత్తు తీగ యమపాశమై పోతులబొగుడ గ్రామానికి చెందిన రైతు ఎం.శివశంకర్(30)ను బలిగొంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. శివశంకర్ ఖరీఫ్‌లో వరి సాగు చేశారు. అడవి పందులు పంటను ధ్వంసం చేస్తుండటంతో వాటిని నియంత్రించేందుకు పొలం చుట్టూ విద్యుత్తు తీగతో కంచె ఏర్పాటు చేశారు. కాపలా కోసం సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి రాకపోవడంతో ఆరా తీయగా నడపడానికి వెళ్లారేమోనని కుటుంబసభ్యులు భావించారు. సాయంత్రం వరకు రాకపోవడంతో అను మానం వచ్చి కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించగా పంట రక్షణకు వేసిన తీగకు తగిలి విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. రెండు నెలల కిందటే వివాహమైంది. ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.


మరమ్మతులు చేస్తూ లైన్‌మెన్..



నవీన్

ఝరాసంగం: నియంత్రిక మరమ్మతులు చేస్తున్న ఓ లైన్‌మెన్ విద్యుదాఘాతంతో మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం చీలేపల్లి గ్రామస్థులు తెలిపిన వివరాలు.. జహీరాబాద్ మండలం హుగ్గెల్లికి చెందిన నవీన్ (34) మూడేళ్లుగా చీలేపల్లిలో లైన్‌మెన్‌గా పని చేస్తున్నారు. మంగళవారం ఉపకేంద్రం నుంచి లైన్‌క్లియర్ తీసుకుని నియంత్రిక వద్ద ఫ్యూజ్ తీగను సరిచేస్తున్నాడు. ఒక్కసారిగా విద్యుత్తు సరఫరా కాగా షాక్ కొట్టి కిందపడ్డాడు. తలకు దెబ్బతగిలి బలంగా గాయపడింది. అధికారులు వెంటనే చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి రెండేళ్ల పాప, నాలుగు నెలల బాబు ఉన్నారు. ఎస్సై నరేష్ వివరాలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ప్రాణం తీసిన విద్యుత్తు కంచె



బుజ్జమ్మ

కొడపల్లి: పంట రక్షణకు బిగించిన విద్యుత్తు కంచె తగిలి మహిళ దుర్మరణం చెందిన ఘటన కొడపల్లి మండలం జాజితండాలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రంజితరెడ్డి తెలిపిన వివరాలు.. తండాకు చెందిన కార్లోత్ బుజ్జిబాయి(38) వ్యవసాయంతో పాటు మేకల పెంపకంతో జీవనం సాగిస్తోంది. మంగళవారం అదవి పందుల రక్షణ కోసం చుట్టు వెన్సింగ్ వైరుకు విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి తీయకుండా అలాగే ఉంచారు. విషయం తెలియక పక్కనే మేకలు మేపుతున్న బుజ్జిబాయి.. అవి పొలంలోకి వెళ్లడంతో వాటితో పాటు ఆమె వెళ్లి విద్యుదాఘాతానికి గురైంది. రెండు మేకలతో పాటు బుజ్జిబాయి అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని తరలించి ప్రమాదానికి కారణమైన వారిని పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు నచ్చజెప్పి మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

వాహనం అదుపుతప్పి.. రైతు దుర్మరణం



అశోక్

ములుగు, న్యూస్‌టుడే: ఆత్మగౌరవంగా తిరిగి వెళ్లిన ఓ రైతు తిరిగివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా మర్కుక్ ఎస్సై దామోదర్ తెలిపిన వివరాలు.. మర్కుక్ మండలం అచ్చంగాపేట చెందిన అశోక్ (38), సునీత దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. దామోదర్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఆత్మగారి ఊరు జగదేవపూర్ మండలం రాయవరం గ్రామానికి శేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అదే రోజున తిరుగు ప్రయాణం కాగా, అంగడి కిష్టాపూర్ గ్రామం వద్ద వాహనం అదుపు తప్పడంతో స్తంభాన్ని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబసభ్యులు మెరుగైన వైద్యానికి హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అశోక్ మృతి చెందాడు. సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

యువకుడి అనుమానాస్పద మృతి



కృష్ణ

నిజాంపేట(రామాయంపేట), న్యూస్‌టుడే: ఇంట్లో నుంచి వెళ్లిన యువకుడు శవమై కనిపించాడు. ఈ ఘటన నిజాంపేట మండలం పరిధి కల్వకుంటలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుంటకు చెందిన ముప్పిగళ్ల కృష్ణ(32) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన కృష్ణ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు మంగళవారం వెతుకుతుండగా గ్రామ శివారులోని చెట్టు కింద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య మంజుల, పిల్లలు ఉన్నారు. తల్లి బాలమణి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్ ధరలు			
ఫారంకోడి	125–00	డ్రెస్డ్	213–00
రిటైల్	147–00	స్కిన్‌లెస్	243–00

పల్లె దవాఖానాకు ఫర్నిచర్ అందజేత

చేగుంట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పల్లె దవాఖానాకు సంఘ సేవకుడు అయిత పరంజ్యోతి మంగళవారం ఫర్నిచర్ అందించారు. కూర్చోవడానికి కుర్చీలూ లేకపోవడంతో దాత టేబుళ్లు, కుర్చీలు, రోగుల కోసం కొంత ఫర్నిచర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి, సీహెచ్‌వో కిషన్, సంపతి, ఏఎన్ఎం నాగమణి పాల్గొన్నారు.

ముదిరాజులకు ప్రాధాన్యం ఇవ్వండి

చిలప్‌చెడ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజులకు 50శాతం సీట్లు కేటాయించాలని మండల సంఘం అధ్యక్షుడు కర్రోల్ల హనుమంత్ డిమాండ్ చేశారు. మంగళవారం చిలప్‌చెడ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికులు బీసీలేనన్నారు. అందులో 70 శాతానికిపైగా గంగపుత్రులు, ముదిరాజులు ఉన్నారన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నార్సింగి(చేగుంట): నార్సింగి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం రానున్నట్లు భారాస మండల అధ్యక్షుడు కుమ్మరి బాబు తెలిపారు. మధ్యాహ్నం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

వేర్వేరు కేంద్రాలు.. అరకొర వసతులు

న్యూస్‌టుడే, నర్సాపూర్

● సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోళ్లకు తిప్పలు

జిల్లాలో ఈసారి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వసతుల కల్పన కష్టంగా మారనుంది. దొడ్డు, సన్న రకాల కొనుగోళ్లకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా సౌకర్యాల ఏర్పాటుకు సమస్యలు తలెత్తే అవకాశముంది. గతంలో ఒక చోటే విక్రయించేవారు. ఈసారి సన్న రకానికి బోనస్ అందించే క్రమంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వసతులు కల్పిస్తోంది. ఆ శాఖ వద్ద గతేడాది నిర్వహించిన కేంద్రాలకు సరిపడా టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, డ్రయ్యర్లు, తేమ యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలు మాత్రమే ఉన్నాయి. ఈసారి అదనంగా కావాలని ప్రతిపాదనలు పంపినా నేటికీ వాటి జాడే లేదు. దీంతో కేంద్రాల నిర్వహణకు అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయని ఆ శాఖ అధికారులు వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా సన్న రకం ధాన్యం కొనుగోలుకు 93, దొడ్డు రకాలకు 390 కేంద్రాలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.

టార్పాలిన్లు లేక తడుస్తున్న ధాన్యం...

ఒకవైపు వర్షాలు కురుస్తుండగా మరోవైపు కొనుగోళ్లు ప్రారంభిస్తున్నారు. ఏటా రైతులకు సరిపడా టార్పాలిన్లు లేక వర్షాలకు ధాన్యం తడిసిపోతోంది. కొందరు ప్రైవేటులో అద్దెకు తెచ్చుకుంటున్నారు. ఒక టార్పాలిన్‌కు రోజుకు రూ.20-30 వరకు చెల్లించాల్సి వస్తోంది. ధాన్యం తరలించాక కేంద్రాల్లో సకాలంలో తూకం వేయకుంటే నెలరోజుల వరకూ వేచి చూసిన సందర్భాలున్నాయి. వర్షాలకు ధాన్యం తడవడం, తిరిగి ఎండబెట్టి విక్రయించే వరకూ టార్పాలిన్ల అవసరముంటుంది. సరిగ్గా ఆరబెట్టకుంటే గింజలకు తెగుళ్లు సోకి రంగుమారి నాణ్యత తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 12 వేల టార్పాలిన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిసింది.

నర్సాపూర్ ఏఎంసీ పరిధిలో..



నర్సాపూర్ ఏఎంసీ పరిధిలో దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు 89, సన్నాలకు 40 ప్రారంభిస్తున్నారు. వీటికి 77 ప్యాడీ క్లీనర్లు, 78 తూకపు యంత్రాలు, 439 టార్పాలిన్లు, 57 తేమ యంత్రాలు సమకూర్చారు. ఇంకా ఏఎంసీలో 13 ప్యాడీ క్లీనర్లు, 11 తూకపు యంత్రాలు, 400 టాపర్లు, 15 తేమ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. అదనంగా 65 తూకపు యంత్రాలు, 700 టార్పాలిన్లు, 704 తేమ యంత్రాలు అవసరమని ఏఎంసీ అధికారులు ప్రతిపాదనలు పంపారు. అవి ఇప్పటి వరకు రాలేదు. ప్రతి గ్రామంలో సన్న, దొడ్డు రకం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఒక్కో గ్రామంలో పీఏసీఎస్ కేంద్రాలూ ఏర్పాటవుతున్నాయి. తద్వారా కేంద్రాలకు వసతుల కల్పన తలనొప్పిగా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏఎంసీ కార్యదర్శి ప్రతాప్‌గౌడ్ వద్ద విషయం ప్రస్తావించగా.. రెండేసి కేంద్రాల ఏర్పాటుకు వసతులు కల్పించడం కష్టమే అవుతుందన్నారు. సామగ్రి సరిపోయేలా లేదన్నారు. అదనంగా కేటాయించాలని ప్రతిపాదించామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్	95730 81675	పెద్దశంకరంపేట 80085 73251
నర్సాపూర్	80085 73222	రామాయంపేట 94402 31031
తూప్రాన్	96762 58144	(10AM TO 1 PM)
చేగుంట	80085 73200	

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: ? మండలంలోని రాంపూర్ శివారులో అకోలా- హైదరాబాద్ 161వ జాతీయ రహదారి పక్కన విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి. దీంతో పశువులు ప్రమాదం బారిన పడే అవకాశముంది.- **రవీందర్, రాంపూర్**

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం..

- శివాజీ, ఏఈ, విద్యుత్తు శాఖ

వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి అవసరం

తూప్రాన్, న్యూస్‌టుడే: ప్రజలంతా వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్ తెలిపారు. మంగళవారం అయోడిన్ దినోత్సవంలో భాగంగా తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ అయోడిన్ రుగ్మతల నివారణ దినంలో భాగంగా వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్

గోడలు కట్టారు.. రేకులు కప్పారు



మండలంలోని ఇబ్రహీంపూర్‌లో రైతు వేదిక పనులను అసంపూర్తిగా వదిలేశారు. రూ.20 లక్షల వ్యయంతో దాన్ని నిర్మించారు. గోడలు నిర్మించి పైన రేకులు వేశారు. ఏఈవోతోపాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చేగుంట**

అవును.. ఇది బస్‌షెల్టరే..



ప్రయాణికుల కోసం నిర్మించిన బస్ షెల్టర్ అధ్వానంగా మారింది. చేగుంట నుంచి మెదక్ వెళ్లే మార్గంలో పొలంపల్లి చౌరస్తాలో 23 ఏళ్ల కిందట అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. మొదట్లో ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడింది. తరవాత పట్టింపులు కరవయ్యాయి. చుట్టుపక్కల పిచ్చిమొక్కలు ఆవరించాయి. **- న్యూస్‌టుడే, చేగుంట**

బోరు బావి.. ప్రమాదకారి



పట్టణ పరిధి 5వ వార్డులోని ఓ బోరు బావి ప్రమాదకరంగా మారింది. సూపర్ మార్కెట్ వెనకనున్న బోరు ఇటీవల కురిసిన వానకు కుంగిపోయి మట్టి కూరుకుపోయింది. దాని సమీపంలోనే కాలనీ ఉండడంతో చిన్నారులు ప్రమాదాల బారిన పడే అవకాశముందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. పుర కమిషనర్ ఖాజా మొయినొద్దీన్ దృష్టికి తీసుకెళ్లగా.. చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, తూప్రాన్**

ఉపకార వేతనాలు ఇవ్వండి.. ఫీజు రీయంబర్స్‌మెంట్ చేయండి

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: పెండింగ్ ఉపకార వేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్‌కిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా ధ్వంసం చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్, నగర కార్యదర్శి అనిల్, సంయుక్త కార్యదర్శి కార్తికేయ, కార్యకర్తలు మల్లేశం, నితిన్, నవీన్, హరి, సమీర్, ఇందు, పూజిత, నిఖిల్, అంబిక, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు

అల్లాదుర్గం : గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని ముస్లాపూర్‌లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని మాట్లాడారు. గ్రామానికి చెందిన అంజయ్య పెరట్లో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అల్లాదుర్గం కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఎస్సై మాన్‌సింగ్, సిబ్బంది సిద్ధయ్య, సర్దార్ అలీ, రవి, వెంకటేశ్, నరేష్ పాల్గొన్నారు.


ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

తూప్రాన్, న్యూస్‌టుడే: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. తూప్రాన్‌కు చెందిన వివాహిత(35) పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా సమీపంలో నివశించేది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై శివానందం తెలిపారు.

ద్విచక్రవాహనం చక్రంలో ఇరికిన కోతి: ఉపాధ్యాయుడికి గాయాలు

శివ్వంపేట: ద్విచక్ర వాహనం ముందు చక్రంలో కోతి చిక్కుకోవడంతో ఉపాధ్యాయుడికి గాయాలయ్యాయి. మండలంలోని చిన్న గొట్టిముక్ల కొత్త కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు హరినాయుడు మంగళవారం సాయంత్రం పాఠశాల విధులు ముగించుకొని నర్సాపూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. బాయన్న చెరువు సమీపంలో కోతి పరుగెత్తుకుంటూ వచ్చి ముందు చక్రంలో ఇరికింది. ఉపాధ్యాయుడు రోడ్డు పక్కన పడిపోయాడు. గమనించిన కొందరు నర్సాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



సుభాష్

కొల్చారం, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సంగాయిపేట తండాలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ తారాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నేనవత్ సుభాష్(28) మద్యానికి బానిసై ఏ పని చేయకుండా జులాయిగా తిరిగేవాడు. ఇదే విషయంలో భార్య షానుతో తరచూ గొడవపడేవాడు. సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వాంతులు చేసుకోవడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఓటు నమోదు చేసుకోండి

నర్సాపూర్, న్యూస్‌టుడే: అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటుహక్కు నమోదు చేసుకోవాలని భాజపా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ సూచించారు. పట్టణంలోని బీవీఆర్ఐటీ, ఎల్లంకి డిగ్రీ, గురుకుల కళాశాల, డాన్‌బాస్కో ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ నవంబరు 6వ తేదీలోగా ఓటుహక్కు పొందాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, నాయకులు మల్లేశ్‌గౌడ్, రమణారావు, అంజిగౌడ్ ఉన్నారు.



మాట్లాడుతున్న రఘునాథ్

బ్రహ్మంగారి మఠం నూతన కార్యవర్గం ఎన్నిక

రేగోడ్, న్యూస్‌టుడే: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బాధ్యులు మంగళవారం తెలిపారు. మఠం కమిటీ అధ్యక్షుడిగా పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, కోశాధికారిగా వీరేశం, గౌరవాధ్యక్షుడిగా నాగేందర్‌రావు, సభ్యులుగా నర్సింహులు, రాధాకిషన్, విజయ్‌భాస్కర్, సర్దార్ ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మఠం అభివృద్ధి, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. నూతన కమిటీ బాధ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సురేందర్, రాములు, చిన్న బ్రహ్మయ్య, నర్సింహులు, శ్రీధర్, విఠల్‌రావు, శివాజీ, చెన్నప్ప, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



కమిటీ బాధ్యులను శాలువాలతో సన్మానిస్తున్న సభ్యులు



పెద్దశంకరంపేటలో..



రామాయంపేటలో..

పోలీసుల సైకిల్ ర్యాలీ

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం పలు మండలాల్లో పోలీసుశాఖ సిబ్బంది సైకిల్ ర్యాలీ నిర్వహించారు. యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఠాణాల నుంచి వీధుల గుండా ర్యాలీలు సాగాయి.

– న్యూస్‌టుడే బృందం



తూప్రాన్: నినాదాలు చేస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గౌతాపూర్ పంచాయతీ గన్యాతండాకు చెందిన రాత్ల సామ్యానాయక్ కౌడిపల్లిలోని బస్టాండు వద్ద రోడ్డు దాటుతుండగా.. ద్విచక్రవాహనం ఢీకొంది. తీవ్ర గాయాలు కావడంతో పీసీలు బాగయ్య, ప్రవీణ్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కణ్నుంచి మెరుగైన చికిత్సకు 108 వాహనంలో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


కౌడిపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని దేవులపల్లిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం నర్సాపూర్ ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు(ఏడీ) జనార్దన్‌రావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పోషకులు పశువులకు టీకాలు వేయించాలన్నారు. పశువైద్యాధికారి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వెల్దుర్తి, శివ్వంపేట, న్యూస్‌టుడే: పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకొని విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని పలు ఠాణాల ఎస్సైలు తెలిపారు. పోటీలు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో ఉంటాయన్నారు. ఈనెల 24 వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచే మొదటి ముగ్గుర్ని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే కృష్ణారావు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా మాతను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు రాజగోపురంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదల ప్రకారం సిబ్బంది సత్కరించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మరమ్మతుల ఖర్చులు విద్యుత్తు శాఖే భరించాలి

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: పొలాల వద్ద నియంత్రికలు పాడైతే విద్యుత్తు శాఖ అధికారులే మరమ్మతులు చేయాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియంత్రిక పాడైతే ఆ పరిధిలోని రైతులు డబ్బులు వేసుకొని మరమ్మతులు చేయించుకుంటున్నారన్నారు. నిజానికి నియంత్రికల మరమ్మతులు, రవాణా ఖర్చులు ఆ శాఖ వారే భరించాలన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

చిరు వ్యాపారుల డబ్బాల తొలగింపు సరికాదు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన కొందరు చిరు వ్యాపారులు డబ్బాల్లో వ్యాపారాలు నిర్వహిస్తుండగా.. పుర అధికారులు వాటిని తొలగించడం సరికాదని అయిదో వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయ అండతో కొందరు డబ్బాలు వేసి ఇతరులకు అద్దెకు ఇచ్చారని, వాటిని సైతం తొలగించాలన్నారు. పురపాలిక ఆధ్వర్యంలో డబ్బాలు ఏర్పాటు చేసి చిరు వ్యాపారులకు అద్దెలకు ఇవ్వాలన్నారు. వారికి మేలు కలుగుతుందన్నారు.

బడికి రక్షణ కరవు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండల పరిధి బండపోసానిపల్లి ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని సీపీఎం మండల ఏరియా కమిటీ నాయకుడు గౌరి డిమాండ్ చేశారు. పాఠశాలకు అన్ని సౌకర్యాలతో మంచి భవనం, విశాలమైన ఆట స్థలం ఉందన్నారు. ప్రహరీ లేకపోవడంతో రక్షణ కరవైందన్నారు. ప్రహరీ నిర్మించాలని మంగళవారం మండల ప్రజాపరిషత్తు కార్యాలయ సీనియర్ సహాయకుడు రంగారావుకు వినతిపత్రం సమర్పించారు. ప్రహరీ లేకపోవడంతో ఆవరణలోకి పాడి పశువులు, కుక్కలు, పందులు వస్తున్నాయని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా కమిటీ సభ్యుడు నందం పాల్గొన్నారు.

కాలువ అధ్వానం.. చెరువు కలుషితం



పట్టణంలోని వైకుంఠధామానికి వెళ్లే దారిలో మురుగు కాలువ అధ్వానంగా మారింది. సమీప ఇళ్లనుంచి వచ్చే మురుగు నీరంతా ఈ కాలువ ద్వారా రాయరావు చెరువులోకి వెళుతోంది. దీంతో చెరువు నీరు కలుషితమవుతోంది. భూగర్భ కాలువ నిర్మించి చెరువులోకి మురుగు వెళ్లకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.**- న్యూస్‌టుడే, నర్సాపూర్**

పథకాల పారదర్శక అమలుకే ఇందిరమ్మ కమిటీలు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో పథకాలను పారదర్శకంగా అమలు పర్చేందుకే ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ధర్మాసాగర్ గేటు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రఘుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కమిటీల్లో అన్ని వర్గాలకు అవకాశం కల్పించిందన్నారు. మండల నాయకులు రాములు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



పాపన్నపేట: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తపస్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.**- న్యూస్‌టుడే బృందం**



మాసాయిపేట ప్రాథమిక పాఠశాల వద్ద..

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రం శివ్వంపేట, దొంతి ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పి.రాంచరణ్, తరుణ్‌తేజ్ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎంలు బాలచంద్రం, శ్రీనివాస్ తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మెదక్‌లో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. ఈనెల 28 నుంచి 30 వరకు పెద్దపల్లి జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రమోహన్, ఎన్.పద్మ, క్రీడాకారులను అభినందించారు. ఉపాధ్యాయులు రమేష్, అరుణాదేవి, లలిత, నాగేశ్వర్, గౌరీశంకర్, వేణుగోపాల్, వెంకటేశ్, సాయిరాం, శ్రీనివాస్, మాలతి, శారద, విజయ, బ్యూల హర్షం వ్యక్తం చేశారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని జక్కపల్లి సమీపంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎస్జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ చాటారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా కేంద్రంలో క్రీడలు నిర్వహించారు. ప్రసన్న, శ్రీజ, దివ్య రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఫర్హానా తెలిపారు. మంగళవారం విద్యార్థులు, పీడీ అశోక్‌ను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

మెదక్ రూరల్: మెదక్‌లో నిర్వహించిన వాలీబాల్ అండర్-17 బాలుర విభాగంలో విజయం సాధించిన జిల్లా జట్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. జట్టులో మంబోజిపల్లి గీతా ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు విక్రాంత్, తరుణ్ ఉన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ మాధవి వారిని అభినందించారు.



నర్సాపూర్: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పేదలకు అండగా సీఎం సహాయ నిధి



ఎదుల్లాపూర్‌లో చెక్కు అందిస్తున్న మాజీ ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అండగా ఉంటోందని మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మండలంలోని ఎదుల్లాపూర్‌కు చెందిన ఎం.యాదిరెడ్డికి రూ.60వేల చెక్కును హరికృష్ణ మంగళవారం అందించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: మండల పరిధి సూరారానికి చెందిన కమలమ్మకు రూ.10వేలు, ధర్మయ్యకు రూ.18,500 సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

మెదక్ అర్బన్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న వేణుగోపాల్‌రావు డాక్టరేట్ పొందినట్లు ప్రిన్సిపల్ డా.హసేన్ తెలిపారు. రాజస్థాన్‌లోని జగదీష్ ప్రసాద్ జబర్మల్ టిబ్రేవాలా విశ్వవిద్యాలయంలో నుంచి 'ప్రోటీనేషన్ ఆఫ్ సింగిల్ వాల్డ్ కార్బన్ నానో ట్యూబ్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా హుసేన్ బాధ్యతలు చేపట్టి మంగళవారానికి ఏడాది పూర్తయిన సందర్భంగా సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

108 అంబులెన్సులో ప్రసవం

చిన్నశంకరంపేట: అంబులెన్సులో గర్భిణి ప్రసవించింది. చిన్నశంకరంపేట పట్టణానికి చెందిన గర్భిణి లావణ్యకు తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. మెదక్‌లోని మాతాశిశు ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. ఈఎంటీ రమేశ్ ప్రసవం చేయగా పండంటి ఆడశిశువు జన్మించింది. తల్లీబిడ్డను ఆసుపత్రికి తరలించారు. ఈఎంటీ రమేశ్, పైలెట్ సురేశ్, జనార్దన్, అఫ్రోజ్‌ను వైద్యులు అభినందించారు.